క్లుప్తంగా

కరెంటు తీగలు తగిలి మూడు గేదెలు మృతి



పెదకాకాని: విద్యుత్‌శాఖ అధికారులు నిర్ల క్ష్యానికి మూడు గేదెలు బలైన సంఘటన కొప్పురావూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శాఖమూరి సాంబయ్య, శ్రీను శనివారం గ్రామ శివారు ప్రాంతానికి పశువుల్ని మేతకు తోలుకెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మేత బాగా పెరిగి ఉండటంతో పాటు అదే ప్రదేశంలోకరెంటు తీగలు తెగి పడి ఉన్నాయి. ఉదయం కరెంటు తీగలు తెగి పడితే మధ్యాహ్నం వరకూ కూడా సిబ్బంది అటువైపు కూడా తిరిగి చూడలేదు. కనీసం సరఫరా కూడా నిలుపుదల చేయలేదు. మేత మేస్తున్న గేదెలు కరెంటు తీగలు తగిలి సంఘటనా ప్రదేశంలో యజమానుల ముందే విలవిల కొట్టుకుంటూ కన్నుమూశాయి. వాటి విలువ రూ. 2 లక్షల దాకా ఉంటుందని, విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



నగరంపాలెం: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వర్తించే ఎస్.భాస్కర్ ఇటీవల విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ మేరకు బాధితుడికి హోంగార్డుల ఒక రోజు వేతనం విరాళం కింద వచ్చిన రూ.2.32 లక్షల చెక్కును భాస్కర్ భార్య రాజశ్రీకి శనివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, హోంగార్డు ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస రావు, ఆర్ఎస్ఐ రత్నరాజు, హోంగార్డు రైటర్ సుధీర్ పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి

గుంటూరు మెడికల్: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి తోడ్పతాయన్నారు. వైద్య కళాశాలలో విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, బోధనా సిబ్బంది డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శివమ్మ, డాక్టర్ కాత్యాయని, డాక్టర్ లీనా, డాక్టర్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నగరంపాలెం: పాత, కొత్త చట్టాలపై మరింత అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్‌ఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది చింతల శ్రీకాంత్ అన్నారు. ఐఎల్‌ఏ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నేర చట్టాలు ప్రాథమిక భావన, కొత్త నేరాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకి ఐఎల్‌ఏ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అధ్యక్షత వహించారు. విశ్రాంత డీడీ, ఏపీ హైకోర్టు న్యాయవాది ఎస్ఆర్ఏ రోజ్‌దార్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బ్రహ్మేశ్వరరావు, మణి, సురేష్ పాల్గొన్నారు.

సిటీ బస్సుల తనిఖీ



నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో తిరుగుతున్న ప్రైవేట్ సిటీ బస్సులను శనివారం సాయంత్రం ఆర్టీఏ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఫిర్యాదుల మేరకు 20 సిటీ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ షేక్ కరీం తెలిపారు. అందులో డ్రైవర్ లైసెన్సులు లేకుండా నాలుగు కేసులు, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై ఒక కేసు, మల్టీ హారన్ కలిగిన వాహనాలపై ఏడు కేసులు, ఇతర నిబంధనలు ఉల్లంఘించినందుకు 8 కేసులు నమోదు చేశారు. తనిఖీలలో ఆర్టీఏ అధికారులు జి గోపాల్, రాఘవరావు, అనిల్, బాలకష్ణ, సౌజన్య మల్లీశ్వరి, ఉషా కిరణ్, పవన్, మధుసూదన్‌రావు, అమృతరాణి పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు

నగరంపాలెం: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా శనివారం గుంటూరు నగరంలోని శ్రీపద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఫిల్, స్పిన్ అండ్ విన్ ప్రారంభించారు. మహారత్న ఓఎంసీ రిటైల్ అవుట్‌లెట్ నెట్‌వర్క్‌లో కస్టమర్ సర్వీస్‌లో అత్యుత్తమ సేవలు, ఆనందాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ జీఎం బెన్నీ సి థామస్, చీఫ్ రీజినల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి

చేబ్రోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి 'అమ్మ' లాగా సంరక్షించాలని గుంటూరు ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి శనివారం ఆయన మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు ప్లకార్డులు, చార్టులు తయారుచేసి ప్రదర్శించారు. పాఠశాలలో కార్యక్రమాల అమలు, సిబ్బంది పనితీరుపై ఆర్జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు. చెట్ల ఆవశ్యకత గురించి వివరించారు. పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్క నాటి, దాన్ని పెంచాలని ఆర్జేడీ సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, ఇంచార్జి హెచ్‌ఎం ఎం. వెంకటేశ్వర్లు, ఎకో క్లబ్ మెంబర్స్ ఉపాధ్యాయులు డి.వి.శ్రీనివాస్, ఎస్. రాధాకృష్ణమూర్తి, ప్రసాద్, సరోజిని పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

కాకుమాను: మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని ఎంఈఓ–2 విజయ్ భాస్కర్ అన్నారు. ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం దాతల సహాయంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ చెట్లు లేకపోతే సకాలంలో వర్షాలు పడక, రైతులు నష్టాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయిని ఎం.జవహర్ రాణి రూ.10వేలతో మొక్కలు కొనుగోలు చేసి పాఠశాల ఆవరణలో నాటించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, రామినేని మధుసూదన్, ఎం.మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాకుమాను పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



మొక్కలు నాటుతున్న ఆర్జేడీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉప విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపైనా ఉందని ఉప విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పాత మల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా ఎంఈవోలు రమాదేవి, లీలారాణి, స్థానిక ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు ప్రజారోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. పర్యావరణ మనుగడ ప్రశ్నార్థకం కాకుండా చూడాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని తెలిపారు. తొలుత స్థానిక పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాతమల్లాయపాలెంలో మొక్కలు నాటుతున్న ఉప విద్యాధికారి వెంకటేశ్వరరావు

'బడిలో బోర్ కొట్టిందేమో'పై విచారణ

ఆయా పాఠశాలల్లో విచారణ జరిపిన ఎంఈవోలు

ప్రత్తిపాడు: విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణి హెచ్చరించారు. ప్రత్తిపాడు మండలంలోని వంగిపురం ప్రాథమిక పాఠశాల, రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు వేసి వచ్చి ప్రత్తిపాడులో టీడీపీ నాయకులతో కాలక్షేపం చేస్తున్నారంటూ.. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'బడిలో బోర్ కొట్టిందేమో' కథనంపై జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాధికారులు స్పందించారు. రావిపాటివారిపాలెంలో ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి హెచ్‌ఎం రవిని విచారించారు. వంగిపురం ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిని కూడా ఆర్‌వీపాలెం స్కూలుకు పిలిపించి విచారించారు. ఎందుకు పాఠశాల సమయంలో బయటకు వెళ్లారని ? ప్రశ్నించారు. ఇద్దరి వద్ద నుంచి లిఖితపూర్వక వివరణలు తీసుకున్నారు. వాటిని జిల్లా విద్యాశాఖాధికారికి పంపినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు.



రావిపాటివారిపాలెం పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

భారతీయ విజ్ఞాన వ్యవస్థపై వ్యాస రచన పోటీలు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల, మోతడక కళాశాల, చలపతి పూర్వ విద్యార్థుల సంఘం, హైదరాబాద్ బలెంఫార్ ప్రైవేట్ లిమిటెడ్, మెదక్ జైంత్ హెల్త్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ విజ్ఞాన వ్యవస్థలు' అనే అంశంపై జాతీయ స్థాయిలో వ్యాసరచన పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శనివారం వ్యాసరచన పోటీల కరపత్రాల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆగస్టు 5వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలతో రూ. 100 రుసుంను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, గూగుల్ ఫామ్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను వెలికి తీయడం ఈ వ్యాసరచన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సూచించిన నియమనిబంధనల్ని అనుసరిస్తూ వ్యాసాల్ని ఈపీఈఎస్‌టీఎస్‌సీఎల్‌పీటీ: జీ మెయిల్‌కు పంపాలని సూచించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, రామారావు తదితరులు

బీసీజీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన అవసరం

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి వైద్యాధికారుల్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాజరైన ఎంపీపీ దాసరి అన్నమ్మ సభ్యుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అధికారుల్ని కోరారు. తొలుత విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్, పశు సంవర్థక, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఐసీడీఎస్ శాఖల అధికారులు వారి శాఖల్లో అమలవుతున్న పథకాలు, వాటి అమలును వివరించారు. సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న కొందరు తీవ్ర అనారోగ్యం పాలై ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరలా ఇప్పుడు వ్యాక్సిన్ అంటే ప్రజలు భయపడిపోతున్నారని, దీనిపై ఆరోగ్య సిబ్బంది అపోహల్ని తొలగించాలని సూచించారు. వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాల్ని గ్రామాలకు ఆరోగ్య సిబ్బంది వచ్చి అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై ఎవ్వరైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు

దంపతులపై దాడిచేసిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దంపతులపై దాడిచేసిన ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. చుట్టుగుంట ప్రాంతంలో నివాసం ఉండే మొగలి ప్రశాంతి, పోలేరమ్మ వద్ద నాలుగు సంవత్సరాల క్రితం రూ.లక్ష తీసుకుంది. వడ్డీ చెల్లిస్తూ వస్తుంది. అయితే వడ్డీతో పాటు, అసలు చెల్లించాలని పోలేరమ్మ, ప్రశాంతిని నిలదీసింది. ఈనేపథ్యంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. పోలేరమ్మ, ఆమె కుమారుడు రాజు, సమీప బంధువు మహాలక్ష్మి ముగ్గురు కలిసి ప్రశాంతి, ఆమె భర్త మురళీకృష్ణలపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి యజమానిపై దాడి చేసి చోరీ

గుంటూరు ఈస్ట్: చోరీకి ప్రయత్నించిన ఇద్దరు, ఇంటి యజమాని తలపై కర్రతో దాడిచేసి పరారైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వెంకటరమణ కాలనీలో శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఇంటి తలుపు రేకుది కావడంతో చోరీకి వచ్చిన ఇద్దరూ తలుపును బలవంతంగా తెరిచి లోపలకు ప్రవేశించారు. అలికిడికి శ్రీనివాసరావు లేచి ఇద్దరిని అడ్డుకోగా, ఇరువురిలో ఒకరు కర్రతో శ్రీనివాసరావు తలపై బలంగా కొట్టి టేబుల్‌పై ఉన్న సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుంటూరు మెడికల్: రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులను ఆదుకోవాలని గుంటూరు జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శనివారం జీజీహెచ్ పిల్లల వార్డులో కారుణ్య సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాయాల్ కాప్స్ ఫౌండర్ బొళ్ల దేవి నాయుడు పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

విద్యార్థుల్లో మనోవికాసానికి వర్క్‌షాపులు దోహదం

గుంటూరు రూరల్: వర్క్‌షాపులు, శిక్షణలు విద్యార్థుల్లో సృజనాత్మకత, మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు. నల్లపాడులోని కళాశాలలో శనివారం లైఫ్ ఫర్ యంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్‌స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషితోనే ఉన్నత శిఖరాల్ని చేరతారని తెలిపారు. లైఫ్ స్కిల్స్ కోచ్ ఆచార్య రమణేశ్వర్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు సమాంతరంగా జీవన నైపుణ్యాల్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. కుటుంబ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా లైఫ్ స్కిల్స్ కార్యక్రమాలు వచ్చి చేరాయని తెలిపారు. ఫౌండేషన్ సీఈవో ఎ. భానుప్రకాష్ మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్‌కి సమాజంలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శేఖర్

దేశాన్ని ప్రగతి పథంలో నడిపిన మేధావి కలాం

కాకుమాను: భారత దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మేధావి, శాస్త్రజ్ఞుడు ఏపీజే అబ్దుల్ కలాం అని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు అన్నారు.పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గేరా మోహనరావు మాట్లాడుతూ 2002 నుంచి 2007వరకు 11వ భారతదేశ రాష్ట్రపతిగా పనిచేసి, దేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని కొనియాడారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు పొంది, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపించారని పేర్కొన్నారు. మహోన్నత వ్యక్తి కలాం జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి, మంజుల, దావులూరి దాసు, లావు అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.



కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గేరా మోహనరావు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరాలని సూరత్ ఎన్ఐటీ ప్రొఫెసర్ జి. విక్టర్ డానియల్ తెలిపారు. నగర శివారు లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న డీప్ లెర్నింగ్‌పై శిక్షణను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విక్టర్ డానియల్ డీప్ లెర్నింగ్‌పై ఆధారపడిన న్యూరల్ నెట్‌వర్క్ లెర్నింగ్, క్లస్టరింగ్ అనాలసిస్, రిగ్రేషన్ అనాలసిస్ తదితర ప్రయోగాల్ని వివరించారు. పైటార్చ్ టూల్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాబ్లమ్స్‌ను వివరించారు. అన్ని రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ రంగంలో ప్రతి విషయాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, డీన్ జె.లక్ష్మీనారాయణ, డాక్టర్ గోపిరాజు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ దివస్ వేడుకలు

గుంటూరు రూరల్: చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కార్గిల్ దివస్ వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి. శాంతమూర్తి మాట్లాడుతూ వెన్నుచూపని కార్గిల్ వీరుడు ధర్మరాజ్ అని కొనియాడారు. విజయ దివాస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ధర్మరాజ్‌ను సన్మానించినట్లు తెలిపారు. ఆయన గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారని చెప్పారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ధర్మరాజ్ ఈ పాఠశాలలో పని చేయడం విద్యార్థుల అదృష్టమని తెలిపారు. దేశ సంరక్షణలో సైనికుల పాత్ర ఎంతో అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం సరోజిని, తెలుగు పండిట్ డి. విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులంతా దేశభక్తి కలిగి ఉండాలని తెలిపారు. కలసికట్టుగా దేశ నిర్మాణానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళి, శ్రీనివాసరావు, జ్ఞానయ్య హనుమంతరావు, వలిరాజు, శాంతిప్రియ, లలితకుమారి, నాగభారతి, పార్వతి, షకీల, షాలిని, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.



గణిత ఉపాధ్యాయుడు, కార్గిల్ వీరుడు ధర్మరాజ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అంకితభావంతో నగర అభివృద్ధికి కృషి

బదిలీపై వెళ్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు నగర కమిషనర్‌గా సంతృప్తిగా విధులు నిర్వహించామని, విధి నిర్వహణలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేశామని ఏపి ట్రాన్స్ కో జెఎండిగా బదిలీ అయిన కీర్తి చేకూరి అన్నారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బదిలీ అయిన కీర్తి చేకూరికి అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు నగర కమిషనర్ గా రెండేళ్ల 3 నెలల కాలం ఎంతో సంతృప్తిగా విధులు నిర్వహించామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నగర అభివృద్ధికి ఎంతగానో సహకరించారని, ప్రధానంగా రోడ్ల విస్తరణ, కాలనీల్లో పార్క్ ల అభివృద్ధికి కృషి చేశామన్నారు. నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించడం తనకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషాన్ని అందించిందని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ కీర్తి చేకూరి సమర్థంగా పనిచేశారని కొనియాడారు. గుంటూరు అర్బన్ ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ కీర్తి తమకు బ్యాచ్ మేట్ అని, విధి నిర్వహణలో అందరినీ కలుపుకొని, తను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పి.రోజా, డెప్యూటీ మేయర్ షేక్ సజల, ఇన్‌చార్జి కమిషనర్ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతుకు అదనపు ఆదాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పశు వైద్యుడు రాంబాబు

గుంటూరు రూరల్: వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతుకు అదనపు ఆదాయంతో యువతకు ఉపాధి లభిస్తుందని పశు వైద్యుడు వి.ఏ.ఎస్.రాంబాబు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం పౌండేషన్‌లో శనివారం సేంద్రియ సాగు, యువతకు ఉపాధి మార్గాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఒక పంటను మాత్రమే సాగు చేస్తూ అనుబంధ రంగాల్ని అశ్రద్ధ చేయడం వల్ల నష్టాల్ని పొందుతున్నారన్నారు. రైతులు తిరిగి పంటలతోపాటు పశుపోషణ, కోళ్లు, మేకలు, గొర్రెలు పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. రైతులకు అదనపు ఆదాయంతోపాటు యువతకు స్వయం ఉపాధి దొరుకుతుందని తెలిపారు. వ్యవసాయశాఖ రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రం మాట్లాడుతూ సాగులో రసాయనాల వల్ల నేలలో సూక్ష్మజీవులు నశించిపోతున్నాయని తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు వేయడం, వ్యవసాయ వ్యర్థాల్ని భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలే విజయావకాశాలకు మార్గాలు

– ఇస్రో డైరెక్టర్ బి.ఎస్. రామకృష్ణ



ఇస్రో డైరెక్టర్ రామకృష్ణ, ప్రొఫెసర్ గంగాధర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి సమస్యను ఒక అవకాశంగా భావించి వాటి పరిష్కార మార్గానికి విద్యార్థులు ఆలోచనలు చేయాలని ఇస్రో డైరెక్టర్ బి.ఎస్. రామకృష్ణ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 36వ బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్‌తో కలిసి పాల్గొన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇస్రో డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా నిత్యం కృషి చేయాలని సూచించారు. ఏఎన్‌యూ ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ విద్యార్థులు భారత దేశ అభివృద్ధే లక్ష్యంగా వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీశ్‌కుమార్ మద్దినేని, కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, పాలకమండలి సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.